ప్రశ్నించే పౌర సమాజ పునాది పండుగగా క్రియ ప్రక్రియను విశ్వసిస్తూ,



ది. 08.03.2009 నవర చర్చి పేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన క్రియ పిల్లల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ ఉప్పలపాటి మాచిరాజు, జిల్లా అధ్యక్షులు, లోక్ సత్తా ఉద్యమ సంస్థ, తూర్పుగోదావరి జిల్లా వారి లేఖ:

20 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో పిల్లలతో నిత్యం ఆవశ్యకంగా ప్రవర్తించే నా తీరు సింహభాగం ఆత్మ సంతృప్తినివ్వని స్థితి. నిత్యాన్వేషణ అనివార్యం. పిల్లల్నించి నేర్చుకోవడమే ఎక్కువగా ఉంటుంది. వాళ్ళని భవిష్యత్ కార్యాచరణోన్ముఖులను చేయడములో తలమునకలై నే చేస్తున్నది చాలడంలేదనే వాస్తవాన్ని అనుభూతిగా స్వీకరిస్తుంటాను.

పిల్లల పరిపూర్ణ వికాసానికి కావలిసిన అన్ని పార్శ్వాలు స్పృశించకపోవడంతో వృత్తి సంతృప్తినివ్వడంలేదని భావిస్తున్న తరుణంలో మిత్రులు నాకోసం కూడానేమో అన్నట్లు క్రియ సంస్థతో నా కోరిక నెరవేర్చే వ్యాసంగమే చేపట్టారు. ఆవిష్కరణోత్సవంలో పాల్గొన్నా ఆచణాత్మక కార్యాచరణలో ఈనాటి వరకు భాగమయ్యే భాగ్యం కలగనందుకు ఎంతో ఇబ్బందిపడ్డాను.

ఈ రోజు నవర చర్చిపేట ప్రాథమిక పాఠశాలలో 'క్రియ పిల్లల పండుగ' లో నిర్వాహక వర్గంలో భాగమై ఆ బాల్య ప్రసాదంలో ఆనందంగా ఆడేసుకున్నాను. అయిదేళ్ళ నుండి పదేళ్ల వయసు పిల్లల ఆనంద నిలయంగా ఆ బడి మారిన క్షణాలు నా చిరకాల వాంఛకు దిశానిర్దేశాన్ని స్థాపించాయి. ఈ పిల్లలకు వ్యక్తిత్వ వికాస తరగతులు, భాషా నైపుణ్యాలు, వేరే శిక్షణలు అవసరం లేని ఎదుగుదలకు ఈ పండుగ దోహదపడుతుందనేది నిస్సందేహం.

ఆర్థికంగా ఎగువ మధ్య తరగతి కుటుంబ వాతావరణంలో పెరిగిన నా బాల్యంలో 5వ తరగతిలోపు ఇన్ని పోటీలు, ఇన్ని బహుమతులు నేనెరుగను. నేను ఈ పిల్లలకు పాఠాలు చెప్పను, హాజరు వేయను, వీళ్ళు చేసిన, వ్రాసిన తప్పులను ఎంచను. వాళ్ళ సామర్థ్యాలను గుర్తించి మంచి వాటిని పొగడడానికి, ప్రోత్సహించడానికే వచ్చాననేది వాళ్ళు గుర్తుపట్టేలా నేను ప్రవర్తించగలిగినందుకు నా చాకచక్యానికి నేనే లోపల్లోపల ఆనందపడిపోయాను.

మౌలికంగా ఉపాధ్యాయుడి పనే ఇదనేది మరోసారి గుర్తు చేసికొన్నాను. కాని దీనికి బాహ్యంగా సిలబస్ పూర్తి, మొక్కుబడి పరీక్షలు, సారా అమ్మకాల టార్గెట్ల వల్లే రిజల్టు టార్గెట్లు వీటి ఊబిలోంచి బయటపడలేకపోతున్న మెజారిటీ ఉపాధ్యాయమిత్రులకు ఈ పరి'క్రియ' ఒడుపు నేర్పాల్సిందేననే నిర్ణయానికి వచ్చాను.

ప్రశ్నించే పౌర సమాజ పునాది పండుగగా క్రియ ప్రక్రియను విశ్వసిస్తూ, దీన్ని లోక్ సత్తా సంస్థ తరపున రాష్ట్రమంతా అమలు చేసే ప్రయత్నం చేయాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్ర శాఖకు పంపించాను. రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు రాష్ట్ర శాఖ తీర్మానిస్తే రాష్ట్ర స్థాయి సమావేశానికి క్రియ భాధ్యులను ఆహ్వానించి అన్ని జిల్లాలలో అమలుకు కృషి చేద్దాం. తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కువమంది సభ్యులు విధ్యాప్రమాణాల పెరుగుదల ఆర్తి ఉన్నవారవడం చేత జిల్లాలో ఈ క్రియను అమలు చేస్తాం.

సహృదయుల (like minded) సాంగత్యం పంచిన క్రియ మిత్రులకు ధన్యవాదాలు తెలుపుతూ ...

మీ

ఉప్పలపాటి మాచిరాజు